01ATP31F_01ATP31F.qxd 31-10-2025 PM 11:11 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 01 నవంబర్ 2025 పేజీలు : 04

పీఏబీఆర్‌లో ఒక స్పిల్‌వే గేటు నుండి దిగువకు నీటి విడుదల దృశ్యం

పీఏబీఆర్ నుండి ఒక స్పిల్‌వే గేట్ ద్వారా 630 క్యూసెక్కుల నీటి విడుదల

-డ్యాంలోకి తగ్గిన ఇన్‌ఫ్లో, డ్యాంలో 5.271 టీఎంసీల నీటి నిలువ

ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త

డాక్టర్ కె.ఎస్.పెన్న అహోబిళం బాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి శుక్రవారం ఒక స్పిల్‌వే గేటు ద్వారా దిగువకు 630 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతోందని డ్యాం డీఈఈ ఎం.వెంకటరమణ, ఏఈఈలు ముత్యాలప్ప, గంగమ్మ, లక్ష్మిదేవి, రేణుక తెలిపారు. డ్యాంలోకి ఇన్‌ఫ్లో తగ్గడంతో దిగువకు నీటి విడుదలను తగ్గించామన్నారు. డ్యాం పూర్తి నీటి నిలువ సామర్థ్యం 11.000 టీఎంసీలు (443 మీటర్లు) కాగా ప్రస్తుతం డ్యాంలో 5.271 టీఎంసీలు (435.600 మీటర్లు) నీరు నిలువ ఉందన్నారు. డ్యాంలోకి 310 క్యూసెక్కుల నీరువస్తుండగా హెచ్ఎల్‌సీద్వారా 150క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 160 క్యూసెక్కులు వస్తోందన్నారు. అవుట్ ఫ్లో 1,730 క్యూసెక్కులు ఉండగా కుడికాలువ ద్వారా 35 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తికి 935క్యూసెక్కులు, స్పిల్‌వేగేటుద్వారా ఎంపీఆర్‌కు 630క్యూసెక్కులు, తాగునీటికై 55క్యూసెక్కులు,ఎవాబిరేటింగ్, గ్యాలరీద్వారా 25క్యూసెక్కులు వెళుతోందని వివరించారు.

మైనింగ్ లీజుల్లో సరిహద్దుల నిర్ధారణలో అధికారులు

మైనింగ్ లీజుల్లో బౌండరీ పిల్లర్ ను పరిశీలిస్తున్న సర్వే బృందం , మైనింగ్ లో సర్వే పరికరాలతో సరిహద్దు రాళ్ళను పరిశీలిస్తున్న బృందం

డి.హిరెహాళ్ అక్టోబరు 31 ప్రభాతవార్త

విలేకరులతో మాట్లాడుతున్న మైనింగ్ డిడి శ్రీనివాస్ చౌదరి

అనంతపురం జిల్లా డి.హిరెహాళ్ మండలంలోని వివాదాస్పద ఇనపగనుల లీజుల విభాగంలో ఆరు మంది సభ్యుల కమిటీలోని ఆయా శాఖల అధికారులు సరిహద్దుల రాళ్ల నిర్ధారణ సర్వే పనులకు సిద్ధమయ్యారు. శనివారం సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఆర్జెడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అటవీశాఖ, గనులుభూగర్భ శాఖ, సర్వేశాఖ ల సిబ్బంది వివాదాస్పద మైనింగ్ లీజులు ఓబులాపురం సర్వేనెంబర్ వన్ లోని ఓఎంసీ 1, ఓఎంసీ 2, ఏఎంసీ, వై ఎం, హెచ్.సిద్దాపురం సర్వే నంబర్ వన్ లోని బిఐఓపి, మలపనగుడి సర్వే నంబర్ వన్ లోని ఏజికె ఇనుపగనుల్లో సర్వే బృందం సోమవారం నుండి సరిహద్దుల సర్వే చేపట్టానుంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ఇరు రాష్ట్రాల ఇంటర్ స్టేట్ బౌండరీలనులను మనదేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు నోడల్ ఏజెన్సీ అయిన సర్వే జనరల్ ఆఫ్ ఇండియా ఫైనలైజ్డ్ చేయడం జరిగింది. ఆ నోడల్ ఏజెన్సీ 2022లో ఫైనలైజ్డ్ చేసిన ఇరు రాష్ట్రాల స్టేట్ బౌండరీలను ఇరు రాష్ట్రాలు ఒప్పుకోవడంతో అప్పటి రిఫరెన్స్ ఆధారంగా తిరిగి ఆంధ్రప్రదేశ్ కు చెందినవివాదాస్పద మైనింగ్ లీజుల్లో రాష్ట్రానికి చెందిన ఆయా శాఖల అధికారుల బృందం బౌండరీల నిర్ధారణకు సన్నద్ధమయ్యింది. ఈ బౌండరీల నిర్ధారణను ఆయా మైనింగ్ లీజుల యజమానులు అంగీకరిస్తారా అన్న అనుమానాలు ఈ ప్రాంత ప్రజల్లో వ్యక్తమవు తున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరిస్తాం.. మైనింగ్ డిడి గనులుభూగర్భశాఖ డిడి శ్రీనివాస్ చౌదరి శనివారం ఇనుపగనుల ప్రాంతంలో విలేకరులతో మాట్లాడుతూ అనంతపురం జిల్లా పరిధిలోని ఆరు మైనింగ్ లీజుల్లో లీగల్ డిస్పూట్స్ నడుస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో 2010లో మన దేశ అత్యున్నత న్యాయస్థానంలో కేసులు నమోదయ్యాయని వాటిని ఫైనలైజ్డ్ చేయాలంటే ముందుగా ఇంటర్ స్టేట్ బౌండరీ ఫైనలైజ్ కావాల్సి ఉందని ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నోడల్ ఏజెన్సీ అయిన సర్వే జనరల్ ఆఫ్ ఇండియా ఫైనలైజ్ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఆ నోడల్ ఏజన్సీ 2022లో ఇంటర్ స్టేట్ బౌండరీ వివాదం విషయమై ఇరు రాష్ట్రాలతో చర్చలు జరపడంతో ఇరు రాష్ట్రాలు ఒప్పుకున్నాయని మైనింగ్ డిడి చెప్పారు. ఆ నోడల్ ఏజెన్సీ అప్పట్లో జరిపిన ఇంటర్ స్టేట్ బౌండరీ సర్వే రెఫరెన్స్ ఆధారంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ఆరు మైనింగ్ లీజుల్లో సరిహద్దులను నిర్ధారించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గత నెలలో సుప్రీంకోర్టు 6 మంది సభ్యులతో ఒక టీంను ఏర్పాటుచేసి ఆ కమిటీకి రిటైర్డ్ జడ్జి సుధాంసుదులియా ను చైర్మన్గా నియమించడం జరిగిందని తెలిపారు. మూడు నెలల కాలపరిమితి లో సరిహద్దు బౌండర్లను ఫిక్స్ చేసి నివేదికలు సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఏంపోర్, మినిస్టర్ ఆఫ్ ఎన్విరాన్మెంటల్ ఫారెస్ట్, రాష్ట్ర ఫారెస్ట్ డిపార్ట్మెంట్, మైనింగ్ డిపార్ట్మెంట్, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ తో కలిసి వారం రోజులుగా పేపర్ వర్క్ చేయడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ మైనింగ్ లీజుల్లో సరిహద్దుల సర్వేను సోమవారం నుండి అత్యంత ఆధునికమైన సాంకేతిక పరమైన డ్రోన్ లాంటి పరికరాలతో బండి రీలు ఏర్పాటుచేసి నిర్ధారించడం జరుగుతుందని ఆయన తెలిపారు. సర్వే పూర్తి అయిననంతరం నవంబరు లో కమిటీ చైర్మన్ రిటైర్డ్ జడ్జి ఈ ఇనుపగనుల్లోని లీజు బౌండరీలను పరిశీలించడానికి రావడం జరుగుతుందని చైర్మన్ ఆధ్వర్యంలో సర్వే నివేదికలను సుప్రీంకోర్టుకు నివేదించడం జరుగుతుందని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

అనంతలో ఊరంతా కబ్జా చేస్తుంటే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఏంచేస్తున్నట్లు?

- 15 వేల కుటుంబాలను కబ్జాదారులు భయపెడుతున్నారు
- సోదరిగా చెబుతున్నా సునీతమ్మా .. జాగ్రత్త పడు నీ చుట్టూ కబ్జా దారులు ఉన్నారు.
- చంద్రబాబు ప్రజాస్వామ్యం వద్దనుకుంటే పోలీస్ స్టేషన్ అన్నింటిని ఎమ్మెల్యేల ఇంటి వద్ద ఏర్పాటు చేయాలి
- 15 రోజుల్లో పాపంపేట సంగతి తేల్చకపోతే చలో అమరావతి పిలుపునిస్తాం
- బహిరంగ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ హెచ్చరిక

సభలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ , బహిరంగ సభలో సిపిఐ నేతలు మాట్లాడుతున్న దృశ్యం

అనంతపురం: అక్టోబర్ 31, (ప్రభాతవార్త బ్యూరో)

అనంతపురం నగరం శివారులో ఉన్న పాపంపేటలో 15వేల కుటుంబాలను కబ్జాదారులు భయపెడుతుంటే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఏమి చేస్తున్నారు? గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాల వల్ల ఐపీఎస్ లు, ఐఏఎస్‌లు జైలుకి వెళ్ళడం మరిచిపోయారా? అంటూ సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ హెచ్చరిక చేశారు. సీఎం చంద్రబాబుకు ప్రజాస్వామ్య మీద నమ్మకం లేకపోతే పోలీస్ స్టేషన్లో అన్నింటిని ఎమ్మెల్యేల ఇండ్ల వద్ద పెట్టుకోవాలని ఆయన ఆరోపించారు. పాపంపేట భూ వివాదంలో ఎమ్మెల్యే పరిటాల సునీతకు సంబంధం లేదంటే ఎవరు నమ్మడం లేదని , ఈ వివాదము లో తనకు సంబంధం లేదని పరిటాల సునీత నిరూపించుకోవాలని , పరిటాల సునీత చుట్టూ కబ్జాదారులు ఉన్నారని, ఒక సోదరిగా చెబుతున్నాను జాగ్రత్త పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పాపంపేటలో అనంతపురం సిపిఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి అధ్యక్షతన పాపంపేట భూ బాధితులకు అండగా సిపిఐ జిల్లాశాఖ ఆధ్వర్యం లో జరిగిన భహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి కే .రామకృష్ణ మాట్లాడుతూ పాపంపేట లో ఊరంతా కబ్జా చేసి వేల కుటుంబాలను భయపెట్టి కబ్జా చేస్తూ భూములు అన్ని మావేనంటూ భయపెడుతుంటే సిగ్గులేని అధికారులుగా కొనసాగుతుండడం ఇంతకంటె దుర్మార్గం ఏముందని సూటిగా ప్రశ్నించారు. ఐపీఎస్ , డీజీప నగరంలో ఒక భాగమైన పాపం పేటను మాది అంటూ కొందరు తెగేసి చెప్పడం చూస్తుంటే ఎంతకు బరితెగించారో అర్థమవుతుందన్నారు. 1964 డిసెంబర్ 26 లో అప్పటి ప్రభుత్వం సోత్రియం భూములు పై ఒక ప్రకటన చేసిందని గుర్తు చేశారు . పాపంపేట భూముల్లో హక్కు మాకు ఉందంటూ కొందరు ముందుకు రావడంతో వారికి సర్వేయర్ , విఆర్ఓ, ఆర్ ఐలు తప్పుడు రికార్డులు సృష్టించి హైకోర్టులో అనుకూల తీర్పు వచ్చేలా చేస్తుంటే జిల్లా ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మీరు దుర్మార్గంగా వ్యవహరిస్తే బాధితులు తరుపున సిపిఐ ఎర్ర జెండా అండగా వుంటుందని ఎవరు టభయపడవద్దని భరోసా ఇచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే సునీత చుట్టూ కబ్జాదార్లు చేరి పోయారని ఆమెను రాజకీయంగా సమాధి చేసే వరకు దుష్టులు వదిలిపెట్టరని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఒక సోదరిగా సలహా ఇస్తున్నానంటూ రామకృష్ణ సునీతమ్మను ఉద్దేశించి మీ ప్రమేయం లేకపోతే భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అధికారులపై ఒత్తిడి తేవాలని డిమాండు చూచించారు. పాపంపేట భూకబ్జా లో ఎమ్మెల్యే సునీత ప్రమేయం లేదంటే ఎవరూ నమ్మడం లేదని దీన్ని ప్రజల్లో నమ్మకం కలిగేలా చూసుకోవాలని మరో సలహా ఇచ్చారు. భూ బాధితుల అందరిని తీసుకువెళ్లి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దగ్గరికి పోతామని 15 రోజులు సమయం ఇచ్చి న్యాయం జరిగేదాకా సిపిఐ అండగా ఉంటుందని హామిరు. అవసరమైతే చలో అమరావతి కార్యక్రమాన్ని పెట్టి ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్తామన్నారు. పాపంపేటలో దుర్మార్గం , పాపాలు జరుగుతుంటే కంప్యూటర్లో అన్ని చూస్తున్న చంద్రబాబుకు ఇక్కడి దుర్మార్గం కనబడలేదా అని ప్రశ్నించారు. కబ్జాదారులకు అండగా నిలిచిన అధికారులు అందరినీ సస్పెండు చేయాలని , ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని అంతే కాకుండా జైల్లో పెట్టించాలని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీష్ మాట్లాడుతూ 15 వేల కుటుంబాలు నివశించే జన సముద్రము లాంటి ప్రదేశాన్ని అవకాశ వదులైన భూకబ్జాదారులు పట్టపగలే ఆన్ లైన్ లో లేని భూమిని లంచగొండి ప్రభుత్వ అధికారులు ఎటువంటి హక్కు లేని వ్యక్తులు 70 సవంత్సరాలుగా జీవనము సాగిస్తున్న నిజమైన లబ్ధిదారులకు సంబంధించిన విలువైన స్థలాన్ని లాగేస్తుంటే ప్రజాస్వామ్యంలో వున్న వామపక్ష వాదులు, ప్రజాతంత్ర వాదులు చూస్తూ వుంటారు అనుకోవడం కబ్జాదారుల అవివేకం అని జగదీష్ పేర్కొన్నారు.

ఇలాంటి దొంగలకు ఏ రూపంలో బుద్ధి చెప్పాలో కమ్యూనిస్టు పార్టీకి కొత్త కాదని జగదీష్ హెచ్చరించారు.పాపంపేట 15 వేల కుటుంబాల అండగా సిపిఐ వుంటుందని ఎవ్వరూ అధైర్య పడద్దని జగదీష్ హామి ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి. జఫర్, జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శులు సిపిఐ సి. మల్లికార్జున, జె. రాజారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామకృష్ణ, ఎన్. శ్రీరాములు, బి. కేశవరెడ్డి,టీ. నారాయణ స్వామి, పద్మావతి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రమణ యం. రమేష్, సి. లింగమయ్య,రాజేష్, సంతోష్ కుమార్, రాప్తాడు మండల సహాయ కార్యదర్శి రామకృష్ణ, నగర సహాయ కార్యదర్శి వి కృష్ణుడు, అనంతపురం బుక్కరాయసముద్రం మండల కార్యదర్శులు నరేష్, బి. రామకృష్ణ,లోకసత్తా జిల్లా అధ్యక్షులు అశోక్ గోపాలరెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్లకు...సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కానే కావాలి..!!

-వేల ఎకరాల భూమి, వందల కోట్ల టర్నోవర్ మాది...కానీ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ బహు దూరం
-గతంలో గోరంట్లలో వారానికి రెండు రోజులు ఉండేది...ఆ సేవలు లేకుండా చేశారు
-చిలమత్తూరులో జరిగే రిజిస్ట్రేషన్‌లో 70 శాతం గోరంట్లవే -గత 10 ఏళ్లుగా భూ క్రయ విక్రయదారులకు నరకయాతన
-నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం...స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతి
-గోరంట్ల మండల ప్రజల పక్షాన...వినతిపత్రం అందజేసిన టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్

మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న టిడిపి నేత నిమ్మల శ్రీధర్ ,జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిని సన్మానిస్తున్న నిమ్మల శ్రీధర్

గోరంట్ల, అక్టోబర్ 31 ప్రభాతవార్త

గోరంట్లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేక ఇబ్బందులు పడుతున్నామని ఏవైనా భూ విక్రయాలు రిజిస్టర్ కావాలంటే చిలమత్తూరుకు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందని గత పది సంవత్సరాల క్రితం వారానికి రెండు రోజులు గోరంట్లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు ఇక్కడే విధులు నిర్వహించే వారని వాటిని తొలగించిన అనంతరం గోరంట్ల మండల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ప్రస్తుత జనాభాను మరియు ధర్మవరం దృష్టిలో పెట్టుకొని గోరంట్ల మండలానికి నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంజూరు చేయాలని రాష్ట్ర స్టాంపు అండ్ రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు గోరంట్ల టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్‌లు గోరంట్ల మండల ప్రజల పక్షాన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి వివరిస్తూ అనంతపురం ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక 108 గ్రామాలు కలిగి గోరంట్ల మండలం పెద్ద మండలంగా గుర్తింపు పొందిందన్నారు. అయితే గోరంట్ల మండల కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేక దాదాపు 25 కిలోమీటర్లు చిలమత్తూరుకు వ్యయ ప్రయాసాలతో వెళ్ళి రిజిస్ట్రేషన్లు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గోరంట్ల మండలంలో 85,000 జనాభా కలిగి ఉండడంతో పాటు పారిశ్రామిక కేంద్రంగా కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటికే గ్రీన్ ఫీల్డ్ హైవే, 342 హైవే, ముద్దనూరు కోడూరు హైవే రోడ్ల విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతూ అభివృద్ధి చెందుతోంది, అయితే గోరంట్ల పట్టణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేక మండల ప్రజలు క్రయవిక్రయాలు జరగాలన్న దానవిక్రయాలు చేయాలన్న స్టాంపులు కావాలన్నా ఏ చిన్న పనికి కూడా ఇబ్బందులు పడుతూ వెళుతున్నామన్నారు. చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కేవలం గోరంట్ల, చిలమత్తూరు, లేపాక్షి మండలాలకు మాత్రమే ఏర్పాటు చేయగా గోరంట్ల మండలంలోని రిజిస్ట్రేషన్‌లు అత్యధికంగా 70 శాతం జరుగుతున్నాయని, చిలమత్తూరు, లేపాక్షి మండలాలకు కలిపి కేవలం 30 శాతం రిజిస్ట్రేషన్లు మాత్రమే నిర్వహిస్తున్నారని, అయితే గోరంట్ల నుండి అత్యధిక సంఖ్యలో వెళుతున్న ప్రజలకు వ్యాపారులకు చిలమత్తూరులో మౌళిక వసతులు కూడా లేక కనీసం భోజన సౌకర్యాలు కూడా సరైన హోటల్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గోరంట్ల పట్టణంలో 2015 వరకు మ్యానువల్ రిజిస్ట్రేషన్లు ప్రతి సోమవారం. వారానికి ఒక్కసారి నిర్వహిస్తుండగా ఆన్‌లైన్ విధానం 2015లో రావడంతో కంప్యూటర్లు ఏర్పాటు చేయలేమని కార్యాలయం నిర్వహించలేమని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు వారానికి ఒక్కసారి వస్తున్న వారు కూడా చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికే బదిలీ చేసి, అధికారులు గోరంట్లలో నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రద్దు చేశారు. గత 10 సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి వచ్చే సమయంలో జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, మా మీద దయ వుంచి గోరంట్ల మండల కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు మరింత సౌకర్యం కల్పించాలని నిమ్మల శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

ఇన్‌చార్జ్ మంత్రిని సన్మానించిన నిమ్మల శ్రీధర్ :

జిల్లాలోని కదిరి నియోజకవర్గం తలుపుల మండలానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచ్చేస్తున్న సందర్భంగా ఆ కార్యక్రమాలకు వెళుతూ మార్గమధ్యంలోని గోరంట్ల పట్టణంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ విచ్చేసిన సందర్భంలో బిసి సంఘం నాయకులు, మండల టిడిపి నేత నిమ్మల శ్రీధర్ మంత్రిని ఘనంగా సన్మానించి అనంతరం మెమెంటోను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కురువ మహేంద్ర, మామిడికాయల హరి, రోహిత్, సుబహాన్, కురుబ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో మరో 25 ఏళ్లు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం..!

-రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్
-ఉరవకొండలో రెండో రోజు 'ఇంటింటి మంత్రి' కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలపై ఆరా

ఉరవకొండలో మహిళలతో సమావేశమై సమస్యలపై ఆరా తీస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఇందిరానగర్ కాలనీలో భారీ వర్షాలకు తడిసిన చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, తాగునీటి నాణ్యత పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలో మరో 25 ఏళ్లు తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణంలో 30 ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్లు ఉన్నాయని వాటిని మారుస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన 'ఇంటింటికీ మంత్రి' కార్యక్రమాన్ని శుక్రవారం 2వ రోజు ఉరవకొండ పట్టణంలో నిర్వహించిన మంత్రి ఇందిరానగర్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ప్రాంతం, అంబేద్కర్ నగర్, ఎన్జీవో కాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల ఇళ్లకు వెళ్లి సమస్యలపై ఆరా తీసి ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన మగ్గాలను ఇందిరానగర్ లో పరిశీలించిన మంత్రి చేనేతకార్మికులతో జరిగిన నష్టంపై ఆరాతీశారు. అక్కడినుండే చేనేత జౌళీ శాఖ ఏడీకు ఫోన్‌చేసి మాట్లాడి మగ్గాలకు జరిగిన నష్టంపై విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించాలని ఆదేశించారు. ప్రజలకు ప్రతిరోజూ స్వచ్ఛమైన నీటిని అందించాలని ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే స్పందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశిస్తూ నీటి స్వచ్ఛతపై అక్కడికక్కడే పరీక్షలు చేయించారు. మహిళలతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మనడబ్బులు-మన లెక్కలు' కార్యక్రమం కింద మహిళాసంఘాల సభ్యులకు నియోజకవర్గం లో 240కోట్లరూపాయలకు రుణప్రణాళిక తయా రు చేయడం జరిగిందని బ్యాంకు రుణాలు స్త్రీనిధి రుణాలద్వారా మహిళలజీవనోపాదులను మెరుగు పర్చడం జరుగుతుందని వివరించారు. తాను రాష్ట్రానికి మంత్రినైనా ఉరవకొండ నియోజకవర్గానికి మోదటి కూలీగానే పనిచేస్తానని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి, మంత్రులు, ఎమ్మెల్యేలు

కదిరి, అక్టోబర్ 31 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలోభాగంగా నేడు(శనివారం) కదిరి నియోజకవర్గంలోని తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి గ్రామానికి వస్తున్న సందర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి పర్యటన, భద్రత ఏర్పాట్లను ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, రాష్ట్ర మంత్రులు అనగాని సత్య ప్రసాద్, సవిత,స్థానికఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌లు పరిశీలించారు. ముఖ్యమంత్రి దిగే హెలీప్యాడ్ ప్రదేశం, భోజన వసతి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన భద్రతఏర్పాట్లు సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఎటువంటి లోపంలేకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పోలీసు అధికారులకు సూచనలు చేస్తూ ముఖ్యమంత్రి పర్యటన మార్గం, హెలీప్యాడ్, పెన్షన్ పంపిణీ చేసే లబ్దిదారుల కాలనీ, పార్కింగ్ ప్రాంతాల్లో సమగ్ర బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అనంతపురం డిఐజిని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతంలో భద్రత చర్యలు చేఆయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు కీలక సూచనలు చేశారు. వాహనాల నియంత్రణ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్‌బాబు, పార్టీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, జాయింట్ కలెక్టర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ కొమ్ము సంపత్‌కుమార్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, మంత్రులు, ఎమ్మెల్యే,ముఖ్య మంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

ఎక్సైజ్ సి ఐ సోమశేఖర్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్ అక్టోబర్ 31 ప్రభాతవార్త

నేటి సమాజంలో డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని అలాంటప్పుడే భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందని కళ్యాణ దుర్గం సర్కిల్ ఎక్సైజ్ సీఐ సోమశేఖర్ పేర్కొన్నారు ఆయన నియోజకవర్గ పరిధిలోని గోళ్ళ గ్రామంలో శుక్రవారం కళ్యాణదుర్గం డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత సమాజం మత్తు పదార్థాలకు బానిసవుతున్నారు.తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు... అలా కాకుండా భావి పౌరులు వాటికి దూరంగా ఉండాలని. మీ చుట్టుపక్కల వాళ్లకు కూడా వాటి బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. స్పెషల్ క్యాంపులో భాగంగా గోళ్ళ గ్రామంలోని ప్రజలకు ఎస్సీ కాలనీలో మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ హర్షలత మాట్లాడుతూ... నేటి యువత... డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నివారణ పై అవగాహన ర్యాలీ, మానవ హారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జోష్జ, సూర్య నాగిరెడ్డి, శేషయ్య, చాముండేశ్వరి ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్రీధర్. తదితరులు పాల్గొన్నారు.

అపిలేపల్లిలో రోడ్డుపై మురుగు నీరు

కుందుర్పి, అక్టోబర్ 31, ప్రభాతవార్త

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని చూపుతున్న స్థానికుడు

డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లు మురికి నీటి కాలువలుగా మారుతున్నాయి. కుందుర్పి మండలం అపిలేపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం ప్రక్కన ఉన్న రోడ్డుకు డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపైనే నిలబడుతూ రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకునే నాధుడే కరువయ్యారని తెలిపారు. రోడ్డుపై మురుకునీరుచేరడంతో అపరిశుభ్రత నెలకొని దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు, కాలనీవాసులు కోరుతున్నారు.

వేదావతి నదిలో తెగిపోయిన రహదారిని పరిశీలించిన మండల టిడిపి అధ్యక్షులు

బ్రహ్మ సముద్రం అక్టోబర్ 31 ప్రభాతవార్త

రహదారిని పరిశీలిస్తున్న దృశ్యం

కళ్యాణ్ దుర్గం శాసనసభ్యులు అమిలి నేని సురేంద్ర బాబు ఆదేశాలు మేరకు బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి గ్రామం నుండి రాయ దుర్గం గుమ్మగట్ట వెళ్లే రహదారి వేదా వతి నదిలో బీటీపీ డ్యాం నుండి వచ్చిన నీటి ప్రవాహానికి గతంలో నిర్మించిన రహదారి కొట్టుకపోవడంతో రహదారి నీ పరిశీలించిప్రజల రాక పోకలకు అంతరాయం కలుగ కుండా తక్షణ చర్యలు చేపడతామని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పాలబండ్లశ్రీరాములు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, మండల ప్రధాన కార్యదర్శి బీమప్ప, గ్రామ కమిటీ అధ్యక్షుడు రుద్రప్ప,వెంకటేశులు, ఫీల్డ్అసిస్టెంట్ రవి తదితరలు పాల్గొన్నారు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ సేకరణ

కళ్యాణదుర్గం, అక్టోబర్ 31 ప్రభాతవార్త

జగజీవన్ రామ్ సర్కిల్లో కోటి సంతకాల శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2019 -24 పాలనలో మెడికల్ కళాశాలలను నిర్మిస్తే, అధికారంలోకి వచ్చిన కోటిని ప్రభుత్వం పిపిపి విధానంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసి పేదవాడికి వైద్య విద్యను దూరం చేస్తోందని, వైసీపీ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, విద్యార్థి నాయకుడు షఫీ తదితరులు విమర్శించారు. పట్టణంలోని జగజీవన్ రామ్ సర్కిల్ లో మున్సిపాలిటీ వైసీపీ కన్వీనర్ సుధీర్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ పై ప్రజాభిప్రాయాన్ని సేకరించి రాష్ట్ర గవర్నర్కు తమ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోళ్ళ సూరి, పాపంపల్లి బాబు, గోపారం శ్రీనివాసులు, షేక్షవలి, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, హబీబ్, జి.రామాంజి, జాకీర్, చరణ్, శ్రీనివాసులు, నాగరాజు, బిక్కి హరి, సురేష్, ఆరుణ, నాగలక్ష్మి, రిజ్వానా, మమత, వంశీ, ఓంకకాష్, బి.రామాంజీ, మురళి, పరమేశప్ప, లక్ష్మణ్ , డీసీ పల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హరిజనవాడలో పౌరహక్కుల దినోత్సవం

గుమ్మఘట్ట అక్టోబర్ 31 ప్రభాతవార్త

సివిల్ రైట్స్ గురించి అవగాహన కల్పిస్తున్న ఎమ్మార్వో

పూలకుంట గ్రామంలో ఆర్ డి టి పాఠశాల లో పౌరహక్కుల దినోత్సవం వ్రరనర్కరించుకొని తహశీల్దార్ రజాక్ వలి అధ్యక్షతన గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు భారత రాజ్యాంగం ప్రకారం పౌరుడికి కలిగి ఉండే హక్కుల గురించి అవగాహన కల్పించారు పౌరహక్కుల ప్రాథమిక హక్కులు విధివిధానాలు గురించి సమావేశం లో మాట్లాడారు ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జయరాములు సచివాలయం సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పోలేపల్లి గ్రామంలో పౌర హక్కులపై అవగాహన సదస్సు

బ్రహ్మ సముద్రం అక్టోబర్ 31 ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న తహసిల్దార్

మండల పరిధిలోని పోలేపల్లి గ్రామ మునందు తహసీల్దార్ సుమతి ఆధ్వర్యంలో పౌరహక్కుల పై అవగాహన కార్యక్రమం నిర్వహించ జరిగింది ఈ సందర్భంగా తహసీల్దార్ సుమతి ప్రసంగిస్తూ సమాజంలో పౌ రులందరూ సమానమని.కుల మత విభేదాలు లేక అందరూ సమానంగా ఉండాలని దేవాలయాల యందు నిషేధం.హోటళ్ల యందురెండుగ్లా సుల పద్ధతి అవి మానాలనీ బాల్య వివాహాలు నిషిద్ధమని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, ఎంపిడిఓ ఉమాదేవి,సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు ఆర్ఐ నాగిరెడ్డి,విఆర్ఓ హనుమంతరావు,సర్పంచ్ మంజునాథ్ అంగన్వాడీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బంది కి మెమోలు జారీ

వార్త ప్రభావం

గుమ్మఘట్ట అక్టోబర్ 31 ప్రభాతవార్త

రంగచేడు గ్రామ సచివాలయం లో పని చేస్తున్న ముగ్గురు కి మెమోలు జారీ చేసినట్లు ఎంపిడిఓ జయరాములు తెలిపారు ఈ నెల 30 న తేదీన వార్త దినపత్రిక లో ప్రచురితమైన సచివాలయానికి తాళం ప్రజాసేవలకు అంతరాయం అనే శీర్షికతో వెలువడిన కథనం మేరకు గుమ్మఘట్ట ఎంపిడిఓ జయరాములు స్పందిస్తూ శుక్రవారం రంగచేడు గ్రామ సచివాలయంలో ఉద్యోగులు గా విధులు నిర్వహిస్తున్నారు వంటి ఎనర్జీ అసిస్టెంట్,సర్వేయర్, మహిళా పోలీసుకు వీరికి మెమోలు జారీ చేసినట్లు రంగచేడు గ్రామ సచివాలయానికి బోర్డు కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

తగ్గుపర్తి, ఎర్రగుడి, ఆవులన్న గ్రామాల నుంచి ఎంపీటీసీగా గెలుపొందిన పుష్పవతి రాజీనామా చేయాలి

- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్

బెలుగుప్ప, అక్టోబర్ 31 ప్రభాతవార్త

మాట్లాడుతున్న వైఎస్ఆర్సిపి నాయకులు

ఇటీవల తెలుగు దేశం పార్టీలోకి వెళ్లిన ఎంపీపీకి సపోర్ట్గా మా గ్రామలు తగ్గుపర్తి, ఎర్రగుడి, ఆవులన్న గ్రామాల ఎంపీటీసీ పుష్పవతి ప్రస్తుత వైస్ ఎంపీపీ పార్టీ ఫిరాయించడం పాల్పడ్డారు. ఈమె మా పార్టీ టికెట్ ఇచ్చి మా రెక్కల కష్టంతో ఎంపీటీసీగా గెలిచే విధంగా కృషి చేశామన్నారు. కావున వీరు ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసి టీడీపీలోకి వెళ్ళాలి. అప్పుడు మిమ్మల్ని అభినందిస్తాం అని వారు అన్నారు. ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయలేని పక్షంలో మీ ఇంటి దగ్గరికి చేరుకొని శాంతియుతర్యాలిని నిర్వహిస్తాం అని మీడియా ముఖంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి నాయకులు అంగడి ఎర్రిస్వామి, నరిగన్న, తగ్గుపర్తి నరేంద్ర,పూల ప్రసాద్, చిన్న ఎర్రిస్వామి, ఎర్రిస్వామి, రమేష్, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

గోరంట్ల తెలుగు తమ్ముళ్లను సన్మానించిన... జిల్లా ఇన్-చార్జ్ మంత్రి అనగాని

-టిడిపి కార్యాలయంలో...మంత్రి అనగానిని సన్మానించిన కన్వీనర్ బాలకృష్ణచౌదరి, స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్

గోరంట్ల, అక్టోబర్ 31 ప్రభాతవార్త



మండల కన్వీనర్ను సన్మానిస్తున్న ఇన్-చార్జ్ మంత్రి

స్టేట్ డైరెక్టర్ను సన్మానిస్తున్న మంత్రి అనగాని

జిల్లాలోని తలుపుల మండలానికి శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచ్చేస్తున్న నేపథ్యంలో మంత్రి సవితమ్మతో పాటు జిల్లా ఇన్-చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెళుతు మార్గమధ్యంలో గోరంట్లలోని టిడిపి కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో గోరంట్ల మండల టిడిపి కన్వీనర్ బాలకృష్ణచౌదరి, హస్త కళల కార్పోరేషన్ స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, మాజీ సర్పంచు నరేష్, గాజులవాండ్లపల్లి వేణుగోపాల్, పాలసముద్రం సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, మాజీ సర్పంచు ఉత్తమరెడ్డి, నిడిమామిడప్ప, తదితరులు ఇన్-చార్జ్ మంత్రికి స్వాగతం పలుకుతూ శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. అనంతరం ఇన్-చార్జ్ మంత్రి స్థానిక కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులను మంత్రి సవితమ్మ ఆయనకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొలెరో వాహనం బోల్తా పడి వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం రూరల్ అక్టోబర్ 31 ప్రభాతవార్త

ప్రమాదంలో మృతి చెందిన రాజప్ప

కళ్యాణ దుర్గం రూరల్ పరిధిలోని అనంతపురం కళ్యాణదుర్గం ప్రధాన రహదారిలో గోళ్ళ గ్రామం వద్ద శుక్రవారం బొలెరో వాహనం బోల్తా పడిన ప్రమాదంలో రాజప్ప (42) మృతి చెందారు గ్రామస్తుల వివరాల మేరకు సెట్టూరు మండల కేంద్రం యాదవ పురానికి చెందిన మృతుడు రాజప్ప తో పాటు భార్య కళ్యాణదుర్గం నందు కలింగర కర్బూజా బొప్పాయి పండ్లను లోడింగ్ పనులకు రోజు వెళ్లే వారని ఆ క్రమంలోనే శుక్రవారం పామిడి గ్రామంలో లోడింగ్ చేసుకొని తిరుగు ప్రయాణంలో కళ్యాణదుర్గానికి వస్తూ ఉండగా మధ్యాహ్నం బొలెరో వాహనం టైరు పగిలిపోయి అదుపుతప్పి బోల్తా పడినట్లు వారు తెలిపారు ఈ ప్రమాదంలో రాజప్ప అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన మరో ఇద్దరు మంజునాథ కృష్ణమూర్తిలకు గాయాలైనట్లు వారిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించినట్లు తెలిపారు మృతుడికి భార్యతో పాటు నలుగురు సంతానం ఉన్నట్లు తెలిసింది ఈ మేరకు స్థానిక రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

కృతజ్ఞతలు తెలుపుతున్న నాగల్లి రాజు

డి.హిరెహాళ్ అక్టోబరు 31 ప్రభాతవార్త

సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆర్యవైశ్యులు కార్పొరేషన్ డైరెక్టర్

రాష్ట్ర ఆర్యవైశ్యులు కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్ళి రాజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శనివారం డి.హిరెహాళ్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ కు పేరు మార్పు చేస్తూ వాసవి పెనుగొండ గా ప్రకటించినందుకు అభినందనీయమని అందుకు ఆర్యవైశ్యులు తరఫున శుభాకాంక్షలు తెలుపుతూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నదని ఈ అవకాశాన్ని తాము సద్వినియోగం చేసుకుంటామని ఆయన తెలిపారు.

అధికారమిస్తే పాలించేందుకు చేతకాని వారు ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి మీకు ఉందా..?

కళ్యాణదుర్గం సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు, టిడిపి నాయకులు.

కళ్యాణదుర్గం అక్టోబర్ 31 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ ఇస్తే అభివృద్ధి చేయడానికి చేతకాక పాలన అందించే సత్తా లేక మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలను కూడా నిర్వహించలేని స్థితిలో నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ చైర్మన్ రాజ్కుమార్ను పదవి నుండి తొలగించిందని టిడిపి కౌన్సిలర్లు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ చైర్మన్ సాంబార్లో కౌన్సిలర్లు రాధిక రాణి అబ్రహం మునిసిపల్ పట్టణ కన్వీనర్ శర్మాస్ వలి మాజీ పట్టణ కన్వీనర్ మురళి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే సురేంద్ర బాబుకు సహకరించక పోవడంతో పాటు కనీసం కౌన్సిల్ మీటింగుల్లో తీర్మానాలు కూడా చేయకపోవడంతో అభివృద్ధి ఆగిపోయిందని అన్నారు. చేతకాని చైర్మన్ ను ప్రభుత్వం తొలగిస్తే వైసిపి నాయకులు పనిగట్టుకుని తమ ఎమ్మెల్యేను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఒక సందర్భంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు వైసీపీ మున్సిపల్ చైర్మన్ రాజు కుమారులు పక్క సీట్లో కూర్చోబెట్టుకుని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి అభివృద్ధికి కృషి చేద్దామని చెబితే పట్టించుకోలేదని మండిపడ్డారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధి చెందితే కూటమి ప్రభుత్వానికి మంచి పేరు ఎక్కడ వస్తుందోనని భయపడి మొఖం చాటేసారని దుయ్యబట్టారు. వైసిపి నాయకులు తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి విమర్శలు చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సాగుతున్న అభివృద్ధి పనులను బయటకొచ్చి చూస్తే కనిపిస్తాయని ఇప్పటికే డ్రైనేజీ వ్యవస్థకు రూపకల్పన చేసిన విషయాన్ని గమనించాలని తెలిపారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

లేపాక్షిలో ఏఐటియుసి కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవం

లేపాక్షి, అక్టోబర్ 31 ప్రభాతవార్త

ఏఐటియుసి జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షిలో నంది విగ్రహం సమీపంలో ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఏఐటియుసి సహాయ కార్యదర్శి బాలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి ఏఐటియుసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏఐటియుసి సహాయ కార్యదర్శి మాట్లాడుతూ ఏఐటియుసి కార్మికుల సంక్షేమానికి 106 సంవత్సరాలుగా కృషి చేస్తూనే ఉందన్నారు. కార్మిక సమస్యలు ఎక్కడ ఉంటే ఏఐటియుసి అక్కడ ఉంటుందన్నారు. కార్మికుల సంక్షేమమే ఏఐటియుసి ప్రధాన ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గౌతమ్కుమార్, ఏఐటియుసి మండల ప్రధాన కార్యదర్శి గోవింద, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వెంకటేష్, జగదీష్, నాగప్ప, శివ, వరలక్ష్మి, అలివేలమ్మ, ఉష, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి గోపిదేవరపల్లిలో శ్రీతులశాంభాదేవి ఉత్సవాలు

లేపాక్షి, అక్టోబర్ 31 ప్రభాతవార్త

మండలంలోని గోపిదేవరపల్లిలో శనివారం నుండి శ్రీతులశాంభాదేవి 15వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమవుతున్నట్టు ఆలయ అర్చకులు చంద్రస్వామి తెలిపారు. 1వ తేదీన 9 గంటలకు కలశాలతో గ్రామోత్సవం గంగాభిషేకము 10.30 గంటలకు అమ్మవారికి పంచామృత అభిషేకము, 12 గంటలకు మహా మంగళహారతి, రాత్రి 8 గంటలకు బాగేపల్లి నాట్య బృందంచే పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. ఆదివారం ఏడున్నర గంటలకు దీపారాధన, మహాగణపతి పూజ, రక్షాబంధన, కలశస్థాపన. నవగ్రహారాధన, పంచామృతాభిషేక అర్చనలు ఉంటాయన్నారు. అనంతరం వివిధ హోమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. 11.30 గంటలకు మరబొమ్మలు, కీలుగుర్రాలు, గురవయ్యలు, మంగళ వాయిద్యాలతో శ్రీతులశాంభాదేవి రథోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదాన కార్యక్రమం రాత్రి 7 గంటలకు కార్తీకదీపం దీపోత్సవం ఎనిమిదిన్నర గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటలకు శ్రీతులశాంభాదేవి బంగారు పల్లకి ఉత్సవం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రధాని మోడీ రైల్వే అభివృద్ధికై లక్ష్యసాధనకు కృషి

గుత్తి, అక్టోబర్ 31 ప్రభాతవార్త

అధికారులు మాట్లాడుతున్న దృశ్యం

దేశ అభివృద్ధి వ్యవస్థలో మూల స్తంభంగా పరిణమించే రైల్వే శాఖ సమగ్ర అభివృద్ధికై ప్రపంచం లోని ఐదు దేశాలకు ధీటుగా లక్ష్య సాధనకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ కృషి చేస్తున్నారని, రైల్వే శాఖ కమర్షియల్ ఇన్స్పెక్టర్ హోసుక్కుమార్, ఐఓడబ్ల్యూ అధికారి నాగేశ్వరనాయక్, రైల్వే స్టేషన్ మేనేజర్ సురేష్బాబులు పేర్కొన్నారు. స్థానిక రైల్వే జంక్షన్లో స్టేషన్ మేనేజర్ ఛాంబర్లో శుక్రవారం అమృత్ సంవాద్ 5.0 పథకం మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంతకల్లు డివిజన్లో ప్రధానమైన గుత్తి రైల్వే జంక్షన్ను అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకై కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం, స్టాల్స్, క్రీడా సౌకర్యాలు, అన్ని విధాలుగా తగు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా గుంతకల్లు నుండి పెండేకల్ రైల్వే బైపాస్ లైన్కు క్రాసింగ్ వద్ద ఆర్ఓఆర్ బ్రిడ్జి నిర్మించే యోచన ఉందన్నారు. త్వరలో కార్యరూపం దాల్చే అవకాశం ఉందని వారన్నారు. రైల్వే అభివృద్ధికై తగు సూచనలను ఇవ్వాల్సిందిగా వారు కోరారు. ఈ సమావేశంలో రైల్వే జంక్షన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు విజయభాస్కర్చౌదరి, పలువురు ప్రముఖులు, వెండర్లు పాల్గొన్నారు.

నెరమెట్లలో అప్పుల బాధతో ఉరి వేసుకొని రైతు ఆత్మహత్య

-వ్యవసాయం కోసం చేసిన అప్పులు రూ.10 లక్షలకుపైగా పేరుకుపోయిన వైనం

ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త

ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న రైతు వి.మంజునాథరెడ్డి

వి.మంజునాథరెడ్డి (ఫైల్ఫోటో)

ప్రకృతి వైపరిత్యాలు, వివిధ కారణాలతో పంటలు సరిగ్గా పండక, వ్యవసాయం కోసం చేసిన అప్పుల భారం అధికం కావడంతో మండల పరిధిలోని నెరమెట్ల గ్రామానికి చెందిన వి.మంజునాథరెడ్డి (45) అనే రైతు అప్పుల బాధతో గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కొక్కేనికి ఉరి బిగించుకొని మరణించగా గ్రామంలో విషాదం అలుముకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లో వెళితే...గ్రామానికి చెందిన వి.మంజునాథరెడ్డికు 3 ఎకరాల నీటి పారుదల కల్గిన భూమి ఉండగా అందులో వరి, మిరప పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గత రెండు మూడు సంవత్సరాలుగా వివిధ కారణాలతో పంటలు చేతికందక, పంటలకు ధరలేక వ్యవసాయం కోసం చేసిన అప్పులు 10 లక్షల రూపాయలకుపైగా పేరుకుపోయాయి. అప్పులకు కుటుంబ సమస్యలు కూడా తోడు కాడంతో నిత్యం మదనపడే వాడని సమాచారం. ఈక్రమంలోనే గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్ కొక్కేనికి ఉరి బిగించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య ఉమాదేవి, తల్లిదండ్రులు వి.ఆనందరెడ్డి, లక్ష్మినరసమ్మ, ఒక సోదరుడు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో శవపరీక్షల అనంతరం అప్పగించారు.

రాష్ట్రీయ ఏకతా దివస్ ర్యాలీ ప్రతిజ్ఞ

కనేకల్లు అక్టోబర్ 31 ప్రభాతవార్త

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కనేకల్ పోలీస్ స్టేషన్ ప్రొబేషనరీ సబ్ఇన్స్పెక్టర్ వి.నారాయణ రెడ్డి ఏ ఎస్ ఐ శంకర్ రెడ్డి, చంద్రమోహన్ సిబ్బంది కలిసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు అనంతరం కనేకల్ ప్రధాన వీధులలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ఇన్స్పెక్టర్ నాగ మధు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరము అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా ఏక్తా దివాస్ ను నిర్వహిస్తారని సర్దార్ వల్లభభాయ్ పటేల్ సేవలను స్మరించుకోవడం, దేశ ఐక్యత, సమగ్రత, భద్రత కాపాడే దిశగా ప్రతి పౌరుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో జూనియర్ కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పోలీస్ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

ద్వాదశ జ్యోతిర్లింగ దర్శన భాగ్యం

సోమందేపల్లి, అక్టోబరు 31 ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న సంచాలకులు

బ్రహ్మపిత బ్రహ్మకుమారి ఈశ్వరియ స్థానిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ద్వాదశ జ్యోతిర్లింగ దివ్యదర్శన భాగ్యమును మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెనుకొండ బ్రాహ్మకుమారి ప్రధాన సంచాలకులు హేమలత పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నవంబర్ 1 నుండి 5వ తేదీ వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సవితమ్మ కూడా పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. మన అందరి తండ్రి పరమపిత శివ పరమాత్మ దర్శనం చేసుకోవడం మన అదృష్టం అన్నారు. కార్తీకమాసంలో జ్యోతిర్లింగ దర్శనం ఏర్పాటు చేసి ప్రజలందరికీ దర్శన భాగ్యం కలగా చేయించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. జ్యోతిర్ల

రాజన్న కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, అక్టోబర్ 31 ప్రభాతవార్త

నియోజకవర్గ పరిధిలోని నార్పల మండలం గూగూడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఆర్.రాజన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద రాజన్న భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను మాట్లాడి ధైర్యం చెప్పి ఓదార్చారు. మీ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆమె వెంట టిడిపి నాయకులు జిసి బాబు, కార్యకర్తలు ఉన్నారు.

రాజన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

అసెంబ్లీకి రాప్తాడు ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక !

రాప్తాడు, అక్టోబర్ 31 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగం" అంశంపై రాప్తాడు నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం వక్తృత్వం వ్యాసరచన పోటీలు విద్యాధికారులు నిర్వహించారు. ఇందులో ఆరు మండలాల విద్యార్థులు పాల్గొన్నారు ప్రతిభ చూపిన ఆరుగురు విద్యా ర్థులకు తిరిగి క్విజ్ పోటీలు నిర్వహించగా స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి శ్యామ్ శ్రీనిత్ రెడ్డి మాక్ అసెంబ్లీకి ఎంపికయ్యారని ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. ఆదర్శ పాఠశాల రాప్తాడు మండల విద్యార్థి ప్రతిభ కనబరిచి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ పోటిలాలో రాప్తాడు నియోజకవర్గం లోని 6 మండలాల నుండి 18 మంది విద్యార్థులు పోటీలో పాల్గొనడం జరిగినది. పోటీలో ఎంపికైన విద్యార్థి నవంబర్ 26 వ తేది అమరావతిలో జరుగు మాక్ అసెంబ్లీఖి కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గా ప్రజాప్రతినిధిగా పాల్గొనే అవకాశం శ్యామ్ శ్రీనిత్ రెడ్డికి లభించడంపై ప్రధానో పాధ్యాయురాలు అంజలిదేవి, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, మండల అధికారులు అంబేద్కర్ చిత్రపటం ఇచ్చి అభినందనలు తెలిపారు, ఈ కార్యక్రమములో వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాములు, ఉపాధ్యాయులు జ్యోతి, పరుశురాము లీలావతి తదితరులు అభినందించారు,

అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి స్టూడెంట్ ఎమ్మెల్యేగా సి.అలేఖ్య

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 31 ప్రభాతవార్త

అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి స్టూడెంట్ ఎమ్మెల్యేగా సి.అలేఖ్య తన ప్రతిభను చాటి ఎంపికయ్యారు. స్థానిక తపోవనంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని సి.అలేఖ్య రాష్ట్ర మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి హాజరు కానున్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మహిళలపై లైంగిక వేదింపులు, వివక్షత అను అంశంపై జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీలలో కూడా ద్వితీయ స్థాయిలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రాజశేఖర్, ఉపాధ్యాయ బృందం అన్నమ్మ, కిష్టప్ప, మధు, సురేష్‌కుమార్, మీనాసకుమారి, గాయత్రి తదితర ఉపాధ్యాయులు పాల్గొని అలేఖ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ క్రాఫ్ట్ టీచర్స్ సుమలత, మమత పాల్గొన్నారు.

స్టూడెంట్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

ఘనంగా ఎస్ఎల్‌సి కార్యక్రమం

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 31 ప్రభాతవార్త

స్థానిక జీసెస్ నగర్‌లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 1, 2వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్ఎల్‌సి కార్యక్రమాన్ని ఈ నెల 25 నుంచి 30వ తేది వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎజిఎం వి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆర్ అండ్ డి హెడ్ భారతి పాల్గొని ఎస్ఎల్‌సి ప్రోగ్రాంలో విద్యార్థి తన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తన అభ్యాసము, భవిష్యత్తు లక్ష్యాల కోసం ప్రణాళికలు రూపొందించుకోవడం, తన ఆత్మవిశ్వాసాన్ని, కమ్యునికేషన్ నైపుణ్యాలను విద్యార్థులు తన అభ్యాస ప్రమాణాన్ని తల్లిదండ్రులతో పంచుకోవడానికి ఎస్ఎల్‌సి కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.రాజేశ్వరి, కోఆర్డినేటర్స్ కుసుమ, హరిత, సుధ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎల్‌సి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

దమ్ముంటే ఎంపీపీ పదవికి రాజీనామ చేసి గెలిచి నిరూపించుకో...

నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు అంజి

బుక్కరాయసముద్రం, అక్టోబర్ 31 ప్రభాతవార్త

దమ్ముంటే ఎంపీపీ పదవికి రాజీనామ చేసి గెలిచి నిరూపించుకోవాలని ఎంపీపీ దాసరి సునీత కు వైకాపా నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు మంత్రి ఆంజనేయులు(అంజి) సవాల్ విసిరారు, శుక్రవారం బుక్కరా యసముద్రం మండల కేంద్రంలోని శింగనమల నియోజకవర్గం వైకాపా పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ వారు మాట్లడుతూ వైసీపీ జెండా చాటున గెలిచావు నీకు ఎంపీపీ పదవి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పెట్టిన బిక్ష అది మరచిపోయి రాజకీయ విలువలను దిగదార్చి మాట్లడడం సరైయిన పద్ధతి కాదన్నారు. మీ పార్టీ సభ్యులే మిమ్మలను చీదరించుకుంటున్నారు టిడిపి సభ్యరాలు కాదని, ఎంపీపీ పదవి కోసం వైకాపా ఎంపీటీసీ సభ్యరాలు శిరీషకు డబ్బు ఆశ చూపి మరళ ఎంపీపీ గా కొనసాగుతున్నారు. కూటమిలో ఏ పార్టీ జెండాతోనైనా గెలిచి చూపించాల న్నారు. ఈ కార్యక్రంలో వారితోపాటు జడ్పిటీసీ నీలం భాస్కర్, సర్పంచు పార్వతి, నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు లక్ష్మినారాయణ, అన్నేరి ఆదినారాయణ, శ్రీనివాసురెడ్డి, కాల్వ నారాయణస్వామి, బయ పరెడ్డి, రంగా, సురేష్, తోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లడుతున్న నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆంజనేయులు

అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తే క్రిమినల్ చర్యలు తప్పవు.. డిఎస్‌పి

బుక్కరాయసముద్రం అక్టోబర్ 31 ప్రభాతవార్త

ప్రభుత్వ అనుమతులు లేకుండ ఎవరైనా ఎర్రమట్టిని తరలిస్తే ఎంతటి వారి కైనా చట్టపరమైన క్రిమినల్ చర్యలు తప్పవని అనంత పురం రూరల్ డిఎస్పీ వెంకటేశులు అన్నారు. శుక్రవారం బుక్కరాయ సముద్రం పోలీసుసేషన్‌ల్లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఇప్పటివరకు మండల వ్యాప్తంగా ఎర్రమట్టిని తరలిస్తున్న 17 ట్రాక్టర్లు, 3 టిప్పర్లు, 3 జేసీబీలు, 4 హిటాచీలు అదుపులోకి తీసుకొని యజ మానుల పై కేసులు నమోదు చేశామన్నారకు. యజమానులకు దాదాపు రూ, 2,64,991లు జరిమానా విధించామన్నారు. నియోజకవర్గంలో ఎర్రమట్టిని తీసుకోవాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు సిఐ పుల్లయ్య, కౌపుకుంట్లయ్య, ఎస్ఐ రాంప్రసాద్, గోవిందు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లడుతున్న డిఎస్పీ వెంకటేశులు

ఎంఈఓ-2లపై తీసుకున్న చర్యలపై పున:పరిశీలన చేయాలి

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 31 ప్రభాతవార్త

గత వారం రోజులుగా జిల్లాలో ఇద్దరు ఎంఈఓ-2లకు సస్పెన్షన్, మెమోలు జారీ చేస్తూ తీసుకున్న నిర్ణయాలను పునఃపరిశీలించాలని ఏపీ ఎంఈఓ-2ల సంఘం జిల్లా అధ్యక్షులు భవాని ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గురు ప్రసాద్ శుక్రవారం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గుమ్మగట్ట మండల ఎంఈఓ-2 రామచంద్రని గతంలో పనిచేసిన పాఠశాల నిధుల వినియోగంపై కొందరు గిట్టని వారు ఇచ్చిన కంప్లెంట్ ఆధారంగా, సరైన పద్ధతిలో ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌కి సంబందించిన అధికారులతో ఎంక్వైరీ చేయించకుండా కేవలం కొంతకాలం పనిచేయడానికి పారిస్ సర్వీసులో మానిటరింగ్ అధికారులుగా నియమించబడిన ఏపీసి, ఎఫ్ఏఓ, ఇంజనీర్ల రిపోర్టులను ఆధారంగా చేసుకుని సస్పెండ్ చేయడం సరైన విధానం కాదన్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు పనులు చేయడానికి ఎంతో మంది హెడ్ మాస్టర్లు వారి ప్రాణాలు కోల్పోవడం జరిగినదన్నారు. ఇంజనీరింగ్, ఇతర అధికారులతో పలు ఇబ్బందులు ఎదుర్కొనడం కూడా జరిగిందన్నారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో పనులను చేయించడంలో ప్రధానోపాధ్యాయులు ముఖ్యపాత్ర వహించడం జరిగిందన్నారు. నాడు నేడు నిబంధనల ప్రకారం హెడ్‌మాస్టర్ల తో పాటు ఇంకా ఎనిమిది మంది సభ్యులు కమిటీలో బాధ్యులుగా ఉంటూ ఉన్నారని, కానీ ఎంక్వైరీ నిర్వహించి కేవలం హెడ్‌మాస్టర్లను మాత్రమే బాధ్యులను చేయడం సరైన విధానం కాదన్నారు. కాబట్టి మరొకమారు డిపార్ట్మెంట్ అధికారులతో అనగా డీవైఈఓ లేదా డీఈఓ స్థాయి అధికారులతో విచారణ చేయించి సస్పెన్షన్‌ను ఎత్తివేయాల్సిందిగా కోరుతున్నామన్నారు. అదేవిధంగా బ్రహ్మసముద్రం మండలం ఎంఈఓ-2 కృష్ణ నాయక్‌కి జారీ చేసిన మెమోలో ఎంఈఓ-2 జాబ్‌చార్ట్‌లో లేనటువంటి అంశాలను ప్రస్తావించడం జరిగిందన్నారు. ఎంఈఓ-2 జాబ్‌చార్ట్ ప్రకారం మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ, సమగ్ర శిక్ష పథకాల పర్యవేక్షణ మాత్రమే ఎంఈఓ-2లుగా తాము నిర్వహిస్తూ ఉన్నామన్నారు. తాము కేవలం మానిటరింగ్ అధికారులు గానే ఉన్నామని, కానీ ఇన్స్పెక్టింగ్ అథారిటీ మాకు లేదన్నారు. అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన టీచర్ అటెండెన్స్, స్టూడెంట్ అటెండ్స్. హెచ్ఎం సర్వీసెస్, టీచర్ సర్వీసెస్ వంటివి మా పరిధిలో లేనటువంటి అంశాలని, కాబట్టి మా జాబ్ చార్ట్ ప్రకారం మాత్రమే మేము విధులు నిర్వహిస్తున్నామని, సంబం దంలేని అంశాలలో ఏకపక్షంగా మెమో జారీ చేయడం సరైన విధానం కాదనన్నారు. ఈ రెండు అం శాలలో తీసుకున్న నిర్ణ యాలను మరొకమారు పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకొని మాకు న్యాయం చేయాలని కోరారు. గత రెండు సంవత్సరాలుగా ఎంఈఓ-2లుగా సమాన హక్కులు, సమాన హోదా కోసం ఎన్నిసార్లు రిప్రజెంటేషన్లు ఇచ్చినప్పటికీ కూడా జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షలలో మాకు తగు న్యాయం జరగలేదన్నారు. ఉదాహరణగా 2021, 24 సంవత్సరానికి సంబందించిన సీస్ బిల్స్ ఇంతవరకు ఎంఈఓ 2 లకు క్రెడిట్ కాలేదన్నారు. గత రెండు సంవత్సరాలలో రెండు సార్లు మిడ్ డే మీల్స్ కుక్ లకు మేము ట్రైనింగ్ నిర్వహించినాము. కానీ ఇంతవరకు దానికి సంబం దించిన బిల్స్ ఒక రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. అలాగే కిచెన్ గార్డెన్ మానిటరింగ్ అథారిటీ ఉన్న మాకు కిచెన్ గార్డెన్ కు సంబం దించిన గ్రాంటు క్రెడిట్ చేయ కుండా, ఎంఈఓ-1లకు క్రెడిట్ చేయడం జరిగిందన్నారు. మెగా పీటీఎంకు సంబంధించిన అమోంట్ కూడా మాకు క్రెడిట్ చేయకుండా, ఎంఈఓ-1లకు క్రెడిట్ చేయడం జరిగిందన్నారు. జిల్లా విద్యాశాఖ మరియు సమగ్ర శిక్ష సిబ్బంది కూడా అనేకమార్లు ఎంఈఓ-2లను ద్వితీయ శ్రేణి ఆఫీసర్లుగా అగౌరవంగాను, అమర్యాదగాను ప్రవర్తించడం కూడా జరిగిందన్నారు. అయినప్పటికీ జిల్లా లోని 31 మంది ఎంఈఓ 2 లకు కేటాయి ంచబడిన సంబందం ఉన్న మరి యు లేకపోయినా ప్రతి పనిని చక్కగా నిర్వర్తించడం జరుగుతుందన్నారు. కాబట్టి ఈ అంశాలను పరిశీలించి ఎంఈఓ-2లకు తగు న్యాయం చేయాలని ఏపీ ఎంఈఓ-2 అసోసియేషన్ పక్షాన కోరుతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రామచంద్ర, కృష్ణా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

డిఇఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపి ఎంఈఓ-2ల సంఘం నేతలు

ప్రజలు తరిమి తరిమి కొడతారని జ్ఞానోదయం అయిందా?

పరిటాల కుటుంబ డైరెక్షన్‌లో రాచూరి కుటుంబ వారసులు స్టేట్మెంట్.

అనంతపురం రూరల్, అక్టోబర్ 31 ప్రభాతవార్త :

రాప్తాడు మాజి ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పాపంపేట భూముల అంశంలో మమ్మల్ని క్షమించమని, పాపంపేట ప్రజలను ఇబ్బంది పెట్టమని రాచూరి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రజలు తరిమి తరిమి కొడతారని ఇప్పుడు జ్ఞానోదయం అయిందా? అని రాప్తాడు మాజి ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాపంపేట ప్రాంతంలో పరిటాల సునిత పర్యటిస్తే పదిమంది కూడా వచ్చే పరిస్థితి లేదని తెలిసి వారి డైరెక్షన్‌లో రాచూరి కుటుంబ వార సులు స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇది మా పెద్దల ఆస్తి అని ఇళ్లు కట్టుకున్న వారి జోలికి వెళ్లమని, ఖాళీ భూముల కోసం మాత్రమేపోరాడతామని చెబు తున్నారు. ప్రతి ఒక్క సర్వే నంబరుకూ నెల్లూరు సెటిల్‌మెంట్ పట్టా వచ్చిం ది. శోత్రియందారులకు ఎలాంటి హక్కు లేదు. వారివద్ద ఎలాంటి డాక్యుమెంట్లు లేవని స్థానిక ఎంఆర్ఓ హైకోర్టు ప్లీడరుకు రాయడం, జిల్లా రిజిస్టర్‌ను మీరు కలిస్తే మీకు హక్కులేదని తేల్చి చెప్పిన తర్వాత కూడా మీరు ఖాళీ స్థలాలజోలికివెళ్తామంటున్నారంటే ఎవరిని చూసుకుని వెళ్తున్నారు. మీ వెనుక ఉన్నవాడెవడు? ఖాళీ భూములను సెటిల్‌మెంట్ చేస్తామని పిలిచినోడు పరిటాలశ్రీరామ్. విద్యారణ్యనగర్‌లో ఇళ్లకు పరిటాల సునితమ్మ అక్క సెటిల్‌మెంట్ చేసిందని, అదే తరహాలో పాపంపేట భూములకు సెటిల్‌మెంట్ చేస్తాదని ఆమె శిష్యబృందం ప్రెస్‌మీట్ పెట్టి మరీచెబుతోంది. జనం చెవుల్లో కాలిఫ్లవర్ పెట్టాలనున్నారా, మీకు హక్కే లేకపోతే హక్కు విడుదల ఏమి చేస్తారు. అందరూ కూడబలుక్కొని మీతో వీడియో చేయించారు. ప్రభుత్వ సాయంతో పాపంపేటలో కోట్లాది రూపాయల విలువైన భూములనుకొట్టేయాలనుకున్న పరిటాల కుటుంబాన్ని ప్రజలుచీదరించుకుంటున్నారు కాబట్టే పక్కా ప్లాన్‌తో ఈ వీడియో చేయించారు. 20 ఎకరాల కరెక్ట్ రిజిస్ట్రేషన్ అయితే సబ్‌రిజిస్టర్‌ను ఎందుకు సస్పెండ్ చేస్తారు? హక్కులేనివారి కితప్పుడుడాక్యుమెంట్లతో రిజిస్టర్ చేసినందునే సస్పెండ్ చేశారు. 176 ఎకరాల భూములకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చిన సర్వేయర్, వీఆర్ఓలను సస్పెండ్ చేసేందుకు సిద్ధపడుతున్నారు. దాదాపు 2 వేల కోట్ల విలువైన 176 ఎకరాల ఆస్తికి పొజిషన్ సర్టిఫికెట్ రాయించారంటే వారి వెనుక ఎవరున్నారో ప్రజలకు అర్థం కాదా? పరిటాల సునిత పాత్ర లేకుండా, పరిటాల సిద్ధార్థ్ ఆర్థికసాయం లేకుండా మీరు ఇవన్నీ చేయగలిగారా 20 ఎకరాలకు రిజిస్ట్రేషన్ ఫీజు కోటి 75 లక్షలు కట్టారు. నెత్తిన రూపాయి పెడితే పావలాకు పోనివా ళ్లు ఇంత డబ్బు ఎక్కడి నుంచి తెచ్చి కట్టారు? వెంకటచౌదరి, సుభాష్‌రెడ్డి, శ్రీరాములు అకౌంట్ల నుంచి వచ్చాయా లేదంటే ఏదైనా కంపెనీ నుంచి వచ్చాయా? లేదంటే ప్రజాప్రతినిధి కుమారుడి అకౌంట్ నుంచి వచ్చాయా అనేది తెలియాల్సి ఉంది. సర్వేయర్, వీఆర్ఓను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుందామని అనుకుంటున్నారా. సీపీఐ ఈ ప్రాంతంలో గతంలో అనేక మార్లు ఎన్నికల్లో పరిటాల సునితకు మద్దతు తెలిపింది. 106 సర్వే నంబరులో ఉన్న ఈ ఇళ్లనుతప్పుడు డాక్యుమెంట్ల తోబెదిరించి కూలదోసినప్పుడు ఎక్కడికి వెళ్లారు. 20 ఎకరాలను తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించుకుని వేల కుటుంబాలకు నిద్రలేకుండా చేస్తే సీపీఐ ఎక్కడికి వెళ్లింది. ఇదే నియోజకవర్గంలో మజ్జిగ లింగ మయ్య ను హత్య చేసిన ప్పుడు ఎక్క డికి పోయింది సీపీఐ పార్టీ? ఇదే నియోజ కవర్గంలో 14 ఏళ్ల దళిత బాలికను నెలల తరబడి పాశ వికంగా అత్యాచా రం చేస్తే సీపీఐ పార్టీ ఎక్కడికి పోయింది హంద్రీనీవా కాలువకు లైనింగ్ వేయడం ద్వారా ఇదే నియోజకవర్గంలో లక్షలాది ఎకరా లుబీళ్లుగామారి పోతుంటే సీపీఐ పార్టీ ఎక్కడికి పోయిందిఈరోజు పరిటాల కోటలు బీటలు పారినాయి. వారి గౌరవం మసకబారింది. వారినిజ స్వరూ పంతెలిసి పో యిందని తెలిసి ఈరోజు వచ్చారా సెటిల్‌మెంట్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుస్తుంటే పాపంపేట ప్రజలు రావడం లేదనే కొత్తగా మీరొచ్చారారామకృష్ణ ఈ ప్రాంతం నుంచి మీరుచట్టసభకు ఎంపికయ్యారు. ప్రైవేట్ డిస్పూట్ అని పరిటాలశ్రీరామ్‌చెబుతున్నాడుఒక ఎమ్మెల్యే కుమా రుడు చెప్పాల్సిన మాటలేనా ఇవి ప్రజల ఆస్తులపై కబ్జాదా రుల కన్నులు పడినప్పుడు వారి కన్నులు పీకాల్సిన ప్రజాప్రతినిధి మాట్లా డాల్సిన మాటలు ఇవేనా14 నివాసాలు నేల కూల్చినప్పుడు పరిటాల సునీత ఎక్కడికి వెళ్లింది. కమ్యూనిస్ట్ పార్టీ ఎక్కడికి వెళ్లింది. మీ ఇళ్ల జోలికి ఎవరూ రారని బాధితులకు అభయం ఇచ్చి తీరా కూల్చేసే సమయంలో సెల్ స్విచ్ఛాఫ్ చేసుకుని పరిటాల శ్రీరామ్ ఎక్కడికి వెళ్లాడు. ఆరోజు కమ్యూనిస్ట్ పార్టీ వాళ్లు ఎందుకుప్రశ్నిం చలేదు. బాధితులకు ఆరోజు అండగా నిలవిం ది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టి. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి. కోర్టుకెళ్లి స్టే తెచ్చి నిల బెట్టగలిగింది నేనే. అక్కడ ఇళ్లు కూల్చివేసి ఎలాంటి భయం కల్పించారో ఆ భయాన్ని 930 ఎకరాల ఆసాములకు చూపించి వసూళ్లు చేయాలని చూస్తే ఎక్కడికి పోయింది సీపీఐ పార్టి. ఈరోజు మీరు వస్తోంది ఉద్యమంలో పాలు పంచు కోవడానికా లేదంటే పరిటాల సునితపై ఉన్న వ్యతిరేకతను తగ్గించడానికి వస్తున్నారా? సమాధానం చెప్పండి రామకృష్ణ ఖచ్చితంగా పాపంపేట భూములపై న్యాయ పోరాటం కొనసాగిస్తాం. ఈప్రాంతం నుంచితరిమికొట్టేదాకా వదిలిపెట్టమన్నారు .ప్రకాష్ రెడ్డి మాకు దేవుడు...ఇళ్ల కూల్చివేత బాధితులు2019లోనే మా ఇళ్లను కూల్చివేస్తామని అధికా రులు ముందుకు వస్తే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వద్దకు వెళ్లి చెప్పుకుంటే అడ్డుకున్నాడు. ఐదేళ్ల పాటు ఒక ఇటుక కూడా తొలిగించకుండా చేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అదే పాత ఆర్డర్లతో బలవంతంగా కూల్చివేశారు. తాము రోడ్డున పడితే ఎంఎల్ఎ గాని, ఇతర నాయకులు గాని కన్నెత్తి చూడలేదు. పైగా ఇక్కడి లోకల్ లీడర్లు రకరకాల ప్రచారం చేస్తున్నారు. వకీలుకు వకీలు ఫీజు తప్పితే కోట్లు మోసుకుపోయి ఇస్తామా ఆరోజు మా ఇళ్లు కూల్చేరోజు బిజెపి, జనసేన, టిడిపి పార్టీలు ఎక్కడికి పోయాయి. ఎందుకు రాలేదు. ప్రకాష్‌రెడ్డి చొరవతోనే కోర్టులో స్టేటస్ కోతెచ్చుకున్నాం. మాకు దేవుడిలా ప్రకాష్‌రెడ్డి వచ్చి ఆదుకున్నాడు. 9 నెలల కిందట కూల్చివేస్తే ఏ ఒక్క రాజకీయ నాయకుడు ఆవైపు కన్నెత్తి చూడలేదు. మా ఇళ్లల్లో ప్రకాష్‌రెడ్డి దేవుడయ్యాడు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి చంద్రకుమార్, వైస్ ఎంపీపీ చియ్యేడు కృష్ణారెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి నీరుగంటి నారాయణరెడ్డి, మండల కన్వీనర్ పవన్ కుమార్, మాజీ మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, మాదన్న యాదవ్, ఈశ్వరయ్య పాపంపేట వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.

ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలి..ఎంపీపీ

బుక్కరాయసముద్రం అక్టోబర్ 31 ప్రభాతవార్త

ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని పాడిపశువులు ఉన్న రైతుల ందరూ వినియోగించుకోవాలని ఎంపీపీ దాసరి సునీత అన్నారు. శుక్రవారం బుక్కరాయసముద్రం పంచాయితీ పరిదిలోని కొట్టాలపల్లి గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశు గణాభివృద్ధి సంఘం, పశుసంవర్ధక ఖాళ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ దాసరి సునీత తోపాటు జిల్లా పశువర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రేమ్‌చంద్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణాధికారి డాక్టర్ వెంకటేష్, అనంతపురం ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, బుక్కరాయసముద్రం ప్రాంతీయ పశవైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎ.వి రత్నకుమార్, రాప్తాడు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టరన ప్రకాష్, రెడ్డిపల్లి ప్రాంతీయ పశుసంవర్ధకశాఖ శిక్షణా కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రామచంద్రరెడ్డి, శింగనమల ప్రాంతీయ పశవైద్యశాల సహాయ సంచాలకులు పద్మనా భం, పీడి, ఆత్మ పద్మలత, పశ ఘనాభివృద్ధి సంఘం డాక్టర్ శ్రీకాంత్, ఆర్‌సిహెచ్‌టిసి రెడ్డిపల్లి డాక్టర్ వినోద్‌కుమార్, కెవికె రెడ్డిపల్లి డాక్టర్ మాదవి, వైద్యాదికారి డాక్టర్ గోవింద్ రాజులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లడుతూ ఏడాదికి ఒక దూడ పుట్టేలంటే పాడి పశువు ఈనిన 45 రోజుల లోపు ఎద సూది వేయించాలని రైతులకు సూసించారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న లింగ నిర్ధారిత వీర్యంను వినియోగించుకోవాలని రైతులకు సూసించారు. కేవలం పెయ్య దూడలు మాత్రమే పుట్టే వీర్యం అందుబాటులో ఉందని ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తూందన్నారు. ఈ శిబిరంలో 42 పాడిపశువులకు ఉచిత గర్భకోశ చికిత్సలు నిర్వహించడం జరిగిందన్నారు. పిడుదులు, గోమార్లతో బాధపడుతున్న పశు వులకు ఉచితంగా పిడుదల మందును స్ప్రేచేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పారా సిబ్బంది రామాంజినేయులు, తేజస్విని, రాజేంద్ర, శివయ్య, గోపాలమిత్ర బాలకొండ, చిన్నకొండయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరాన్ని ప్రారంబిస్తున్న ఎంపీపీ సునీత, అధికారులు

పరిపాలన దక్షితకు నిలువెత్తు దర్పణం ముఖ్యమంత్రి చంద్రబాబు

- .రైతుల కళ్లల్లో ఆనందం నింపే మధుర క్షణానికి కృష్ణ జలాలే సాక్షంగా నిలుస్తున్నాయి - తండ్రి, కుమారుడి మూడు దఫాల పాలనలో కరువు సీమకు కాసిన్ని నీళ్లైనా తెచ్చారా..? - పదవీ వ్యామోహంతో రాష్ట్ర ప్రగతిని పాతాళానికి తొక్కిన ఘనత వైసిపి అధినేత జగన్‌దే..! - ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో జగన్‌పై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి, అక్టోబర్ 31 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజల ప్రగతిని ఆకాంక్షించి రాష్ట్రంలో అభివృద్ధి మూడు పూవులు, ఆరు కాయలుగా విరాజిల్లాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి, సంక్షేమ పథకాలే లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుపోతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే కందికుంట వెకట ప్రసాద్ స్పష్ట ంచ ఏశారు. ఈ సందర్భంలో శుక్రవారం నియోజకవర్గంలోని తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో మీడియాతో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తలుపుల మండలానికి సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ప్రజల వద్దకే రావడం దేశ చరిత్రలో సువర్ణ ఘట్టంగా మిగిలిపోతుందన్నారు. పక్కనే ఉన్న పులివెందుల నియోజకవర్గం నుంచి తండ

నెట్టికంటి ఆంజినేయస్వామి రాజగోపురముల శిక్షర ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, అక్టోబర్ 31 ప్రభాతవార్త

గుంతకల్లు గుమ్మనూరు జయరామ్ ఆహ్వానం మేరకు కసాపురం గ్రామంలో వెలిసిన శ్రీనెట్టికంటి ఆంజినేయస్వామి రాజగోపురంల శిక్షర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో శుక్రవారం జిల్లాలోని సహచర ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో కలిసి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనెట్టికంటి ఆంజినేయస్వామి వారిని దర్శించుకుని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేందుకు వారిపై స్వామివారి కృప ఉండాలని ఎమ్మెల్యే కోరుకున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి స్వాగతం పలుకుతున్న టిడిపి నేతలు

నెట్టికంటి ఆంజినేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజలకు సత్వర సేవలు అందించండి

బత్తలపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త

అధికారులందరూ సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సత్వర సేవలు అందించాలని జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొలుత అధికారులతో సమావేశమై పరిచయం చేసుకున్నారు. వారి విధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సమపాలన తప్పక పాటించాలని సూచించారు. అనంతరం రికార్డులను, పరిశీలించారు. మండల అభివృద్ధి గురించి ఎంపీడీఓ నరసింహానాయుడుతో సమీక్షించారు. మండలంలో రూ.3కోట్లుతో సిమెంట్ రోడ్లు మంజూరు అయినట్లు తెలిపారు. వాటిలో 70 శాతం పనులు పూర్తి అయినట్లు వివరించారు. కాంట్రాక్టర్లుకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు 81గాను 67 పనులను పూర్తి చేసినట్లు వివరించారు. పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనుల గురించి ఆరా తీశారు. ప్రస్తుతం పనులు ఏమీ జరగడం లేదన్నారు. పండ్లతోటల పెంపకం కింద 66 మంది రైతులు 255 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం. కూలీలకు ఈకేవైసీ చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి పనుల్లో ఆక్రమాలను నివారించేందుకు. నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. అనంతరం హౌసింగ్ అదికారులతో స్కీంల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గతంలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మను అదికారులు శాలువకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మండల పరిషత్తు అభివృద్ధి అధికారి క్రిష్టప్ప, హౌసింగ్ ఏఈ విశ్వనాథ్, ఏపీవో అశోక్, కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడిఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ చైర్పర్సన్

జడ్పీ చైర్పర్సన్ ను సన్మానిస్తున్న అధికారులు

తుఫాను బాధిత రైతాంగాన్ని తక్షణ ఆదుకోవాలి

- తడిసిన ధాన్యం కొనాలి - వరికి ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలి - పండ్లతోట రైతులకు వంద శాతం పరిహారాన్ని అందించాలి - క్షేత్రస్థాయికి సిపిఐ బృందాలు వెళ్తాం సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం, అక్టోబర్ 31 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్రంలో తుఫాను బాధిత రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని, నష్టపోయిన పంటలను అంచనా వేసి పరిహారం అందించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ మెంథా తుఫాను బాధిత రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని కోరారు. మెట్ట ప్రాంత రైతులు సైతం తీవ్రంగా నష్టపోయాంని, వరిపంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.30వేలు చొప్పున పరిహారం అందించాలని కోరారు. పండ్ల తోటల రైతులకు వంద శాతం పరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యం లెక్క కట్టి ప్రతి గింజకు పరిహారం అందించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక తెప్పించుకొని కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేస్తూ ఏరియల్ సర్వే చేస్తే సరిపోదని, రైతులకు పరిహారం ఎంత అందించారనేది ముఖ్యమన్నారు. క్షేత్రస్థాయికి సిపిఐ బృందాలు వెళ్లి రైతాంగం నష్టపోయిన సమాచారాన్ని ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ప్రతిపక్షం కంటే అధికారపక్షం తుఫాను బాధితుల దగ్గరికి వెళ్లినా ఏమి ప్రయోజనం అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్యాయాన్ని ప్రశ్నిస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చి సీజ్ ద షిప్ అని చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ అక్రమంగా తరలిపోతున్న బియ్యాన్ని పట్టుకున్నారా అని ప్రశ్నించారు.

సత్య సాయి జన్మ దినోత్సవ పనులు చక్కబెట్టేందుకు ఆరుగురు మంత్రులు : సత్య సాయిబాబా వంద జన్మదిన వేడుకలకు ఆరుగురు రాష్ట్ర మంత్రులను నియమించి ప్రభుత్వం ఆదర్యంలో పనులు చేపట్టడం ఎంత మాత్రమూ సభబు కాదన్నారు. ఏదో దేవాదాయ స్థానిక మంత్రిని కేటాయించి అక్కడ జరుగుతున్న పనులను సమీక్షిస్తే సరిపోతుందని దీనికి ఇంతటి ఆర్బాటం అవసరం లేదన్నారు. సత్య సాయి జన్మదిన కార్యక్రమం కంటే తుఫాను బాధిత రైతాంగం కోసం మంత్రుల బృందాన్ని పంపడం మంచిదన్నారు.

నవంబర్ 18న నిరసన ర్యాలీలు : దళితులు, బలహీన వర్గాలపై పెరుగుతున్న దాడులపై ఇటీవల జరిగిన సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ దాడులపై విశ్లేషణాత్మక చర్చలు జరిగాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. దేశవ్యాప్తంగా దళితులు, పేద ప్రజలు, బలహీన వర్గాలపై దాడులు పెరుగుతున్నాయని, ఇది సామాజిక న్యాయ వ్యవస్థకు తీవ్రమైన ప్రమాదమని పేర్కొన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అణగారిన వర్గాల పట్ల వివక్షాపూరిత వైఖరిని అవలంబించడం వలన ఈ దాడులు మరింత ఉధృతమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కులు సాధనకు కట్టుబడి ఉన్న సీపీఐ నవంబర్ 18వ తేదీన దేశవ్యాప్తంగా నిరసన ర్యాలీలు నిర్వహించేందుకు పిలుపునిచ్చింది. ఈ నిరసనల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు బలహీన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, జె.రాజారెడ్డి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.కేశవరెడ్డి, ఎన్.శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు బి.రమణయ్యలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

పీఏబీఆర్‌వద్ద నల్లగుట్ట అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు విన్నవించిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త

పీఏబీఆర్‌కు ఆనుకొని ఉన్న నల్లగుట్ట అక్రమ మైనింగ్‌ను వెంటనే ఆపాలని, మైనింగ్‌కు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకొని కేసులు పెట్టి శిక్షించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ అక్రమ మైనింగ్ కారణంగా డ్యాం భద్రత ప్రమాదకరంగా మారుతోందన్నారు. దాదాపు 10 కోట్ల రూపాయలు విలువైన గ్రానైట్‌ను ఇప్పటికే అక్రమంగా తరలించారన్నారు. ఉరవకొండ నియోజకవర్గ టీడీపీ అండతోనే అక్రమ మైనింగ్ జరుగుతోందన్నారు. డ్యాం దెబ్బతింటే చుట్టుపక్కల అనేక గ్రామాలకు ప్రమాదం జరుగుతుందన్నారు. వాటాలు వేసుకొని మైనింగ్ నిర్వహిస్తున్నారని అయినా రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని వివరించారు. బ్రాహ్మణపల్లి సర్వే నంబర్ 93కు చెందిన 136 ఎకరాల భూమి ఎవరికి చెందుతుందో నిర్ధారించాలని కోరారు. ఇది చెరువుగా ఉందని గ్రామస్థులు చెబుతున్నారని చెరువును కాజేయాలని కొందరు రాజకీయ నాయకులు యత్నిస్తున్నారని వివరించారు. ఇక్కడ పేదలు వేసుకున్న గుడిసెలను కూడా బలవంతంగా తొలగించి ప్రశ్నించిన వారిని కొట్టించారన్నారు. తెలుగుదేశం పార్టీ నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తుండగా ఇప్పటివరకు పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు ఇవ్వలేదని దీంతోనే పేదలు గుడిసెలు వేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఇల్లు, ఇంటి స్థలాలులేని పేదలను గుర్తించి వారికి పట్టాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని వై.విశ్వేశ్వరరెడ్డి కలెక్టర్‌ను కోరారు.

జిల్లా కలెక్టర్‌కు మర్యాదపూర్వకంగా కలిసి మెమొక్కను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వైభవంగా రాజగోపురముల శిఖర ప్రతిష్ఠ

- ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపి, ఎమ్మెల్యేలు - విశేష పూజల నడుమ కలశాల ప్రతిష్ఠ

గుంతకల్లు, అక్టోబర్ 31 ప్రభాతవార్త

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో రాజగోపురముల శిఖర (18 కలశాల) ప్రతిష్ఠ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు, పూజారులు ఉదయం యాగశాలలో చతుర్వేద పారాయణము, నిత్యారాధన, ద్వార తోరణ పూజ, ఉపకుంభారాధన, రామాయణ పారాయణ, పంచ సూక్త హవనము, మహా పూర్ణాహుతితో పాటు 11.11 గంటలకు శిఖరబలి, మాన్‌బలి, దద్నశాంతి, మహా కుంభ ప్రోక్షణ, మంగళ శాసనం, వేదా శీర్వచము నిర్వహించారు. విశేష పూజల నడుమ ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంలు ముఖ్య అతిథులుగా హాజరై దేవాలయ రాజగోపురములపై కలశాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా కళ్యాణదుర్గం, రాయదుర్గం, రాప్తాడు, పుట్టపర్తి, శింగనమల ఎమ్మెల్యేలు అలిమినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, బండారు శ్రావణిశ్రీలు హాజరయ్యారు. ఎమ్మెల్యేలకు ఆలయ అధికారులు, వేద పండితులు సాదర స్వాగతం పలికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబుతో మాట్లాడి ఆలయ అభివృద్ధికి నిధులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ అభివృద్ధికి 12 కోట్లు విరాళాలు ఇచ్చిన ఉభయ రాష్ట్రాల దాతలను ఈ సందర్భంగా సన్మానించారు. కలశాల ప్రతిష్ఠకు కృషిచేసిన ఈఓ మేడేపల్లి విజయరాజును ఎమ్మెల్యేలు అభినందించారు. అంతకుముందు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబసభ్యులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసుల కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, అనువంశక ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ కార్యనిర్వాహక అధికారి విజయరాజు, ఇతర రాష్ట్రాల దాతలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకెకుతున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

కలశాలకు నమస్కరిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

కసాపురం ఆంజినేయస్వామని దర్శించుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, అక్టోబర్ 31 ప్రభాతవార్త

కసాపురం పండితులు, ఆలయ అధికారుల స్వాగతంతో శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారిని రాప్తాడు శాసన సభ్యురాలు శ్రీమతి పరిటాల సునీతమ్మ శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం దేవస్థానం గోపురాలకు కళశస్థాపన కార్యక్రమంలో భాగంగా జరుగుచున్న హోమంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు.

స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే, తదితరులు

114 చెరువులకు సాగునీరు అందించే పథకం స్పీడ్ పెంచిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు. ప్రజల్లో ఎమ్మెల్యే హామీ పట్ల పెరుగుతున్న నమ్మకం

కళ్యాణదుర్గం అక్టోబర్ 31 ప్రభాతవార్త :

కళ్యాణదుర్గం నియోజకవర్గానికి వరప్రసాధిని అయిన బిటిపికుందుర్పి బ్రాంచ్ కెనాల్ కాలువల నిర్మాణపు పనుల కోసం ఎస్ ఆర్ కన్స్ట్రక్షన్స్ కంపెనీకి చెందిన భారీ వాహనాలు శుక్రవారం కళ్యాణదుర్గం చేరుకున్నాయి. ఈ సందర్భంగా వచ్చిన వాహనాలకు పూజలు నిర్వహించి పనుల వేగం పెంచేందుకు సమాయత్తం అవుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి కేవలం 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న జీడిపల్లి రిజర్వాయర్ నుండి కళ్యాణదుర్గం ప్రాంతంలోని 114 చెరువులకు సాగునీరు అందించాలని పథకం పై ఎమ్మెల్యే సురేంద్రబాబు ఎన్నికల సమయంలో రెండున్నర సంవత్సరాల కాలంలో కాలువల నిర్మాణపు పనులను పూర్తి చేసి 114 చెరువులకు సాగునీరు అందిస్తామని ఊరువాడ ప్రచారంలో హామీ ఇచ్చారు. కుందుర్పి బ్రాంచ్ కెనాల్ నిర్మాణ పనుల కాంట్రాక్టర్ కూడా ఎమ్మెల్యే కు చెందిన సంస్థ కావడంతో శుక్రవారం 30 టిప్పర్లు 11 భారీ జెసిపి యంత్రాలు కళ్యాణదుర్గం చేరుకున్న సందర్భం నియోజకవర్గంలో చర్చనీయాంశం అయింది.

ఎన్నికలలో ఇచ్చిన మాట కోసం ఎమ్మెల్యే ఎంతో తాపత్రయపడుతున్నారని కుందుర్పి బ్రాంచ్ కెనాల్ కాలువల నిర్మాణానికి సంబంధించిన భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలని పదేపదే రాష్ట్ర నీటిపారుదుల శాఖ మంత్రితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా పలుమార్లు తీసుకువెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అంతేకాకుండా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువ నేత నారా లోకేష్ బాబు దృష్టిలో కూడా ఈ పథకం ప్రాధాన్యత గురించి వివరించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఒకవైపు ప్రతిపక్షం నుండి తీవ్ర విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో తాను ఇచ్చిన మాట నిలుపుకోవడం కోసం కళ్యాణదుర్గం ఎమ్మెల్యే భారీ యంత్రాలను రప్పించి కాలువల నిర్మాణాల స్పీడు పెంచుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం కాస్త సహకరించి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం తొందరగా చెల్లించగలిగితే కాలువల నిర్మాణం పనులు అనుకున్న సమయానికంటే ముందుగా పూర్తి చేసే అవకాశం ఉంటుందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. 100 రోజుల్లో 350 కిలోమీటర్ల పొడవున కుప్పం నియోజకవర్గానికి నీళ్లు ఇచ్చే కార్యక్రమంలో కాలువల లైనింగ్ పనులు పూర్తి చేసిన ఎమ్మెల్యే కు చెందిన సంస్థకు త్వరితగతిన బిటిపికుందుర్పి బ్రాంచ్ కెనాల్ కాలువల త్రవ్వకం పెద్ద పనేమి కాదని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే భూ పరిహారం చెల్లించిన ప్రాంతాలలో కాలువల నిర్మాణపు పనులు జోరుగానే సాగుతున్న విషయం తెలిసిందే. అయితే జీడిపల్లి నుండి కళ్యాణదుర్గం గరుడాపురం వరకు మధ్యన సుమారు ఆరేడు పంప్ హౌస్ నిర్మాణాలు పూర్తి చేయవలసిన ఆవశ్యకత ఉంది. కాలువల నిర్మాణాలు సాగుతుండగానే స్ట్రక్చర్స్ కాంట్రాక్టులు తీసుకున్న కంపెనీ పూర్తి చేయగలిగితే 114 చెరువులకు కృష్ణానది జలాలు పరుగులు తీస్తాయని ప్రజలు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల కళ్యాణదుర్గం నియోజకవర్గం లోని కరువుకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని, గ్రామాలు వదిలి వలసలు పోయిన రైతులు తిరిగి తమ గ్రామాలకు చేరుకొని వ్యవసాయాన్ని పండుగలా నిర్వహించాలనేది ఈ పథకంలోని భావన. మరి అన్ని సవ్యంగా జరిగితే కళ్యాణదుర్గం ప్రాంతంలోని 114 చెరువులకు సాగునీరు ఎప్పుడెప్పుడు అందుతుందా అని ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారు. అన్ని సవ్యంగా జరిగితే కళ్యాణదుర్గం ప్రాంతంలోని 114 చెరువులకు సాగునీరు ఎప్పుడెప్పుడు అందుతుందాని ఈ ప్రాంత ప్రజలు, రైతులు ఎదురుచూస్తున్నారు. మరి ఈ కాలువల నిర్మాణం 114 చెరువులకు సాగునీరు అందే భవిష్యత్తు ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉంది.

పి టి పి కాలువల తవ్వకాల కోసం కళ్యాణదుర్గం వచ్చిన భారీ యంత్రాలు

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షునిగా గుత్తా హరి

- ఏపీ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎంపిక - అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆమోదం - జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణం వెల్లడి

అనంతపురం, అక్టోబర్ 31 ప్రభాతవార్త బ్యూరో

అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ "శ్రీశ్రీ కళావేదిక" ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ప్రముఖ సాహితీవేత్త, అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆదేశాల మేరకు ఈ కమిటీని నియమించినట్లు జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీభూషణం వెల్లడించారు. అన్ని జిల్లాలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వివరించారు. ఈ మేరకు జాతీయ కోర్ కమిటీ చర్చించి అనుభవం, సేవాభావం, సమర్థత, నిబద్ధత ప్రాతిపదికన రాష్ట్ర నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షునిగా ప్రముఖ కవి, సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ గుత్తా హరి సర్వోత్తమ నాయుడుకు రెండోసారి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యక్షునిగా కూడా ఆయన సేవలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో అనుబంధ విభాగాలను కూడా పటిష్టం చేసేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

నూతనంగా ఎంపికైన పూర్తి కార్యవర్గాన్ని ఈశ్వరీభూషణం ప్రకటించారు. కొత్త కమిటీ సభ్యుల పూర్తి జాబితాను శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశ్రీ కళావేదిక నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఘనతతో ఏర్పాటు చేసినట్లు సగర్వంగా ప్రకటిస్తున్నామన్నారు. ఈ కార్యవర్గం ఏకగ్రీవంగా, సభ్యుల సంపూర్ణ అనుమతితో, సీనియర్, ప్రతిభావంతుల సహకారంతో ఏర్పడిందన్నారు. ఈ కొత్త రాష్ట్ర కమిటీలో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల ప్రఖ్యాత సీనియర్ నాయకులు చేరడం గొప్ప అదృష్టమన్నారు. వారు తమ ప్రతిభ, అనుభవం, సృజనాత్మక శక్తితో శ్రీశ్రీ కళావేదిక అభ్యుదయానికి, సాహిత్య విస్తరణకు మార్గదర్శకులుగా నిలుస్తారని పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యక్షులు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు (అనంతపురము) ను రెండోసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షునిగా ప్రముఖ న్యాయవాది, సీనియర్ కవి నరహరి నారాయణ రెడ్డి (కర్నూలు), రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ప్రముఖ విద్యావేత్త, అనువాదకులు డా. పి.రమేష్ నారాయణ (అనంతపురము), రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా కవయిత్రి మలేకర్ నాగజ్యోతి (కర్నూలు)ని ఎంపిజేశారు. రాష్ట్ర గౌరవ సలహాదారుగా విద్యాసంస్థల అధినేత కామ కోటి ప్రసాదరావు (మదనపల్లి), రాష్ట్ర క్రమశిక్షణా మండలి అధ్యక్షుడిగా ప్రముఖ విద్యావేత్త, రచయిత కొలచిన రామ జగన్నాథ్ (శ్రీకాకుళం), రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గా ప్రముఖ న్యాయవాది, కవి మరువాడ భానోజీ (విశాఖపట్నం) నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాయలసీమ ప్రాంతీయ అధ్యక్షుడిగా అరవ జయపాల్ (తిరుపతి), ఉత్తరాంధ్ర ప్రాంతీయ అధ్యక్షునిగా ప్రముఖ విద్యావేత్త, రచయిత డబ్బీరు గోవిందరావుకు అవకాశం దక్కింది. రాష్ట్ర సమన్వయకర్తగా సి.హెచ్. రవికుమార్ (కృష్ణా), రాష్ట్ర అధికార ప్రతినిధిగా డా.కె.ఆర్.జి. శేషుకుమార్ (విజయవాడ)లకు చోటు కల్పించారు. రాష్ట్ర కార్యదర్శులుగా నల్లా నరసింహమూర్తి (కోనసీమ), బివివి సత్యనారాయణ (అమలాపురం), అమ్మకవి కొండేపూడి తాతబ్బాయి (కాకినాడ), ఎస్.వి.వి.ఎస్.ప్రసాద్ (పశ్చిమ గోదావరి), యనమదల సూర్య నారాయణ రాజు (విశాఖపట్నం), సుజయ్ కృష్ణ (ఏలూరు), గొట్టుముక్కల నాసరయ్య (ప్రకాశం), వివిస్ ప్రసాద్ (తణుకు), నూనె రమేష్ (అల్లూరి జిల్లా), రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా బోగెల ఉమా మహేశ్వరరావు (శ్రీకాకుళం), జి.ఎల్.ఎన్.శాస్త్రి (అనకాపల్లి), నియమితులయ్యారు. రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా బైరపోగు బెన్నమ్మ (కర్నూలు), మహిళా కార్యదర్శులుగా శ్యామల శ్రీహరికోటి (ఏలూరు), సువర్ణ జోషి (కర్నూలు), కరణం విమల (చిత్తూరు), ఇళ్లిపిల్ల నాగపావని (విజయవాడ), ఏలూరు ధర్మవతి (భీమిలి) లను ఎంపికజేశారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శులుగా హరిత (పీలేరు), కోలకొండ వీర నాగేశ్వరయ్య (కర్నూలు)లను నియమించారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరి

పారదర్శక సేవలే ప్రామాణికం

ఇకపై అహుడా ఎన్టీఆర్ స్మార్ట్ లేఔట్లలో ఈ వేలం - అహుడ చైర్మన్ టీసి వరుణ్, వైస్ చైర్పర్సన్ శివ నారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్షా సమావేశం

అనంతపురం అక్టోబర్ 31 ప్రభాతవార్త

పారదర్శక సేవలే ప్రామాణికంగా అహుడా సేవలు అందిస్తుందని అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. శుక్రవారం స్థానిక అహుడ కార్యాలయంలో చైర్మన్ టీసీ వరుణ్, వైస్ చైర్ పర్సన్ శివ నారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ టిసి వరుణ్ అహుడ అధికారులకు పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఉన్న ఒక కుటుంబానికి ఒక ప్లాట్ నిబంధన ఎత్తివేసామని, ఆసక్తి ఆర్థిక స్తోమత ఉన్నవారు ఎన్ని ఫ్లాట్లు అయినా కొనుగోలు చేసే సౌలభ్యం కల్పించామన్నారు. అందుకు పారదర్శకంగా అహుడ ఎన్టీఆర్ స్మార్ట్ లేఔట్లలో ఈ వేలం నూతనంగా అమలు చేయనున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన వెబ్సైట్, ప్లాట్ల ధరలు ఇత రత్రా ప్రాధాన్యత అంశాలపై చైర్మన్ వరుణ్, వైస్ చైర్పర్సన్ శివ నారాయణ శర్మ అధికారులతో చర్చించారు. త్వరలోనే వెబ్సైట్ రూపొందించడం తో పాటు లాంచ్ చేయాలని అహుడ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కే ఎం డి.ఇషాక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుష్యంత్, రేవంత్, జే పి ఓ హరీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హుడా చైర్మన్ టి సి వరుణ్

మట్టిమాఫియా.. ఇసుక మాఫియా కేరాఫ్ అడ్రెస్ గత ప్రభుత్వం

- శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, అక్టోబర్ 31 ప్రభాతవార్త

మట్టి అక్రమ ఆరోపణలు, రాజకీయ ప్రయోజనాల కోసమే పూర్వ పరాలు పరిశీలించకుండా తప్పుడు ప్రచ